మీలా పందికొక్కులం కాదు

- దమ్ముంటే హెచ్‌సీయూకి రండి
- జింకలెక్కడున్నయో చూపిస్తం
- సీఎం పై విద్యార్థిని ఫైర్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): 'అవును మేము గుంట నక్కలమే.. మీలాగా పందికొక్కులం కాదు.. ఇక్కడికి రండి.. జింకలు, పశు పక్ష్యాదులు ఎక్కడున్నాయో వర్సిటీ భూముల్లో చూపిస్తం' అని సీఎం రేవంత్‌రెడ్డిని హెచ్‌సీయూకి చెందిన ఓ విద్యార్థిని డిమాండ్ చేశారు. మీడియాతో మాట్లాడుతూ ఆమె ప్రభుత్వ వైఖరిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆమె మాట్లాడిన విషయాలు ఆమె మాటల్లోనే.. హైదరాబాద్‌లో జింకలు ఉన్న ఫలంగా ఎలా వస్తాయి? ఎవరు తీసుకొస్తారు? జల్, జమీన్, జంగల్ మావే.. ఇక్కడ ఉన్న పిచ్చుక, పక్షి, జంతువు అన్నింటినీ కాపాడాలనుకుంటున్నాం. కేవలం రాజకీయ లబ్ధి కోసమే పచ్చని అటవీ ప్రాంతాన్ని చెరబట్టడం ఎంతవరకు న్యాయం. అసెంబ్లీలో తెగిస్తాం.. అని ఒక సీఎం మాట్లాడుతారా? ఒక రౌడీలా మాట్లాడారని విమర్శించారు. మూగజీవాలకు ఆవాసమైన అడవిని కాపాడుకునేందుకు వెనుకడుగు వేయబోం, ప్రభుత్వంతో ఎంతవరకైనా పోరాడుతాం. మమ్మల్ని గుంటనక్కలు అంటూ ఎక్కడో

కూర్చొని అనడం కాదు.. దమ్ముంటే ఇక్కడికి వచ్చి మాట్లాడాలి.. హెచ్‌సీయూలో జరుగుతున్న విధ్వంసాన్ని ఆపాలి. ఇక్కడున్న బయోడైవర్సిటీ నగరానికి ఊపిరిలాంటిది. ఇది నాశనమైతే మనం బతకడం కష్టం.. అని ఆ విద్యార్థిని హెచ్చరించింది.

ఏఐసీసీకి హెచ్‌సీయూ సెగ

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తేతెలంగాణ): కంచె గచ్చిబౌలి భూముల సెగ కాంగ్రెస్ అధిష్ఠానాన్ని తాకింది. రాష్ట్రంలో చోటుచేసుకున్న పరిణామాలపై ఎందుకు స్పందించడం లేదని విద్యార్థి, ప్రజా సంఘాల నుంచి కాంగ్రెస్ పెద్దలకు పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. హెచ్‌సీయు వివాదం జాతీయ స్థాయిలో కాంగ్రెస్ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నదని వారు తలలుపట్టుకుంటున్నట్టు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల జాతీయ స్థాయిలో సమాధానం చెప్పుకోవాల్సి వస్తున్నదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే, రాహుల్‌గాంధీ గుర్రుగా ఉన్నట్టు తెలిసింది. ఈ వివాదంపై తాజా పరిస్థితులను పార్టీ నేతల ద్వారా తెలుసుకొనేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. ఈ వివాదం కాంగ్రెస్ ప్రతిష్ఠను. రాహుల్‌గాంధీ విశ్వసనీయతను దెబ్బతీస్తున్నదని అధిష్ఠానం ఆందోళన వ్యక్తం చేసినట్టు తెలిసింది. జాతీయ స్థాయిలో ప్రతిపక్షంగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను తప్పుపడుతూ ఆందోళన చేస్తున్న సమయంలో..రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు వ్యతిరేకంగా యూనివర్సిటీ భూములను అమ్మకానికి పెట్టడం ఏమిటని అధిష్ఠానం పెద్దలు తప్పుపట్టినట్లు సమాచారం. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ సెంట్రల్ యూనివర్సిటీని సందర్శించడం, విద్యార్థులతో సమావేశం కావడం, వారికి ఇచ్చిన హామీలను గుర్తుచేసుకుంటున్న విద్యార్థులు.. ప్రస్తుత పరిస్థితిపై ఆయనకు వాట్సాప్‌లో సందేశాలు పంపుతున్నట్టు తెలిసింది.

కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ ఎంపీలు సురేశ్‌రెడ్డి, వద్దిరాజు, దామోదర్‌రావు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ దాసోజు తదితరులు

విద్యారంగంపై సీఎం రేవంత్ దాడి

- 'రియల్' మాఫియాను ప్రోత్సహిస్తున్నారు
- హెచ్‌సీయూలో విధ్వంసంపై కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు దాసోజు శ్రవణ్ ఫిర్యాదు

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల విలువైన భూమిని కబ్జా చేసి, దాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతికి అప్పగించేందుకు కుట్ర జరుగుతున్నదని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఆరోపించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు బుధవారం ఆయన హెచ్‌సీయూ భూముల్లో జరుగుతున్న విధ్వంసంపై ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దాసోజు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య స్ఫూర్తిని మసకబారుస్తూ, రియల్ మాఫియాకు అనుకూలంగా సీఎం నిర్ణయాలు తీసుకుంటున్నారని ఫైర్ అయ్యారు. విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్ర జరుగుతున్నదని విమర్శించారు. రాష్ట్రంలో విద్యా సంస్కరణలను నిరోధిస్తూ, విద్యార్థుల భవిష్యత్తును సర్వనాశనం చేసేలా సీఎం చర్యలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఒక విద్యాసంస్థపై దాడి మాత్రమే కాదని, దేశ భవిష్యత్తుకు తూట్లు పొడిచే చర్యగా అభివర్ణించారు. ఈ భూమిని రక్షించేందుకు యూనివర్సిటీ యాజమాన్యం గతంలో సుదీర్ఘ న్యాయ పోరాటం చేసినప్పటికీ, ప్రభుత్వం తాజాగా కబ్జా చేయడానికి మరో కుట్ర మొదలుపెట్టిందని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందని దుయ్యబట్టారు. ఒక జింకను వేటాడినందుకు బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ జైలు శిక్ష అనుభవించారని, హెచ్‌సీయూలో వందలాది నెమళ్లు, జింకలను హతమారుస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ఎలాంటి శిక్ష పడాలి? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో జరుగుతున్న ఈ దుర్మార్గాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

రేవంత్ అండతోనే లాఠీచార్జి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అండతోనే పోలీసులు హెచ్‌సీయూ విద్యార్థులపై లాఠీచార్జి చేశారని దాసోజు శ్రవణ్ ఆరోపించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై దమనకాండకు దిగడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇప్పటికైనా భూముల వేలాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.

జేఎన్టీయూ భూమికి హక్కుపత్రాల్లేవ్!

- హక్కుపత్రాలివ్వాలని పాలకమండలి తీర్మానం

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూ భూవివాదం నేపథ్యంలో తాజాగా మరోకొత్త విషయం వెలుగులోకి వచ్చింది. దేశంలోనే తొలి టెక్నాలజీ యూనివర్సిటీ అయిన జేఎన్టీయూ స్థలానికి హక్కు పత్రాలేవన్న విషయం బయటికొచ్చింది. హెచ్‌సీయూ భూవివాదం నేపథ్యంలో తమ వర్సిటీ స్థలాన్ని లాక్కుంటారేమోనన్న ఆందోళన వర్సిటీ అధికారులకు కలుగుతున్నది. తమది లీజు స్థలమే కావడంతో అభివృద్ధి పేర తీసుకుంటారేమోనన్న అనుమానం వారిని పీడిస్తున్నది. దీంతో కూకట్‌పల్లిలోని స్థలంపై వర్సిటీకి హక్కుపత్రాలివ్వాలని ఇటీవలే పాలకమండలి తీర్మానం చేసింది. అనేక ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలకు ఉచితంగా స్థలాలిస్తున్న సర్కారు.. ప్రభుత్వ విద్యాసంస్థ అయిన జేఎన్టీయూకు కూడా ఉచితంగా స్థలాన్ని కేటాయించాలని వర్సిటీ పాలకమండలి సర్కారును కోరింది. ఏటా 2 కోట్ల చొప్పున 80 –100 కోట్ల వరకు హౌజింగ్‌బోర్డు, ప్రభుత్వానికి చెల్లించామని.. వర్సిటీ స్థలంపై పూర్తి హక్కులు కల్పించాలని ఆయా సమావేశంలో తీర్మానించింది. జేఎన్టీయూను 1972లో ఏర్పాటు చేశారు. ఈ వర్సిటీకి కూకట్‌పల్లిలో 89 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలం హౌజింగ్ బోర్డుది కాగా, ఈ 89 ఎకరాల స్థలాన్ని లీజు పద్ధతిలో వర్సిటీకి అప్పగించారు. కొంతకాలం వరకు ఏటా రూ. 2 కోట్లను వర్సిటీ హౌజింగ్ బోర్డుకు చెల్లించింది. అయితే 9ఏండ్ల క్రితం హౌజింగ్ బోర్డును ప్రభుత్వం రద్దుచేయడంతో బోర్డు స్థలాలన్నీ ప్రభుత్వపరమయ్యాయి. వర్సిటీ స్థలం విలువను రూ. 80 కోట్లుగా పరిగణించి వర్సిటీకి ఉచితంగా హక్కుపత్రాలివ్వాలని విద్యార్థులు, ఆచార్యులు కోరుతున్నారు.

కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో విద్యార్థులు, నాయకులకు సంకెళ్లు వేసి లాక్కెళ్తూ వినూత్నంగా నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మంత్రి కొండా సురేఖ ఇంటి ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న కేయూ విద్యార్థి సంఘాల నాయకులు

హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఆపాలి

- సీపీఎం ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దహనాలు
- ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా నిరసనలు

నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 2: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలోని 400 ఎకరాల భూములను కాంగ్రెస్ ప్రభుత్వం వేలం వేయడాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా సీపీఎం శ్రేణులు ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశాయి. హనుమకొండ, జనగామ, మహబూబాబాద్ జిల్లాలోని పలు సెంటర్లలో పార్టీ నాయకులు ధర్నా, రాస్తారోకో చేశారు. ఏబీవీపీ కేయూ శాఖ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలోని అన్ని విభాగాల తరగతులను బహిష్కరించారు. శాయంపేట బస్టాండ్ సెంటర్‌లో బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ నాయకులు ఆందోళన నిర్వహించారు.

తెలంగాణ వర్సిటీ బంద్

ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ యూనివర్సిటీ బంద్ నిర్వహించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ నుంచి యూనివర్సిటీ మెయిన్ గేట్ వరకు ముఖ్యమంత్రి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి, దహనం చేశారు.

వేలం నిలిపివేయాలి

ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా సీపీఎం, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీలు చేపట్టడంతోపాటు పలుచోట్ల సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. పాల్వంచ, టేకులపల్లి, ఎర్రుపాలెం, కారేపల్లి, తిరుమలాయపాలెం, కొణిజర్ల, ఖమ్మం నగరం, ఇల్లెందు, జూలూరుపాడు మండల కేంద్రాల్లో నిరసనలు, దిష్టిబొమ్మల దహన కార్యక్రమాలు చేపట్టారు.

సీపీఎం నాయకుల కన్నెర్ర

కరీంనగ్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో నగర కార్యదర్శి పోలీసుల వేషధారణ వేసుకొని సీపీఎం, ఎస్ఎస్ఐ కార్యకర్తలకు సంకెళ్లు వేసి లాక్కెళ్లుతున్నట్టు వినూత్నంగా నిరసన తెలిపారు. నగరంలోని సదాశివపల్లిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంకరి సంపత్, మండల కార్యకర్తలతో కలిసి విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. హుజూరాబాద్ పట్టణంలో సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల శంకర్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీలో తరగతులు బహిష్కరించారు.

నేడు సచివాలయ ముట్టడి

హైదరాబాద్‌లో ప్రభుత్వ తీరుపై సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతున్నది. సేవ్ హెచ్‌సీయూ హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్ కొనసాగింది. బుధవారం నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద సీపీఎం ఆధ్వర్యంలో విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులు నిరసన తెలిపారు. కేబీఆర్ పార్క్ వద్ద బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొన్నారు. కూకట్‌పల్లి జేఎన్‌టీయూ విద్యార్థులు తరగతులను బహిష్కరించారు. ట్యాంక్‌బండ్‌పై ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. హెచ్‌సీయూ ప్రొఫెసర్లు గళమెత్తారు. బీజేవైఎం, పలు విద్యార్థి సంఘాలతో హెచ్‌సీయూ అట్టుడికింది. ఎస్ఎఫ్ఐ, ఇతర వామపక్ష విద్యార్థి సంఘాలు గురువారం చలో సెక్రటేరియట్‌కు పిలుపునిచ్చాయి.

మంత్రి సురేఖ ఇల్లు ముట్టడి

కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాలు బుధవారం హనుమకొండ రాంనగర్‌లోని మంత్రి కొండా సురేఖ ఇంటిని ముట్టడించారు. పోలీసుల వలయాన్ని ఛేదించుకొని మంత్రి ఇంటి గేటు ముందు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, విద్యార్థి సంఘ నాయకులకు మధ్య తోపులాట జరిగింది. విద్యార్థులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి వ్యాన్లలో ఎక్కించి సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు బీ నరసింహారావు, మొగిలి వెంకట్‌రెడ్డి, మర్రి మహేశ్, భాషబోయిన సంతోశ్, కే శ్రావణ్, మాలోత్ రాజేశ్, మంద నరేశ్, ఎల్తూరి సాయికుమార్, కుమ్మరి శ్రీనాథ్, శివ నాస్తిక్ పాల్గొన్నారు.

వాణిజ్య

ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్‌గా పూనమ్ గుప్తా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: ఎన్‌సీఏఈఆర్ డైరెక్టర్ జనరల్ పూనమ్ గుప్తాను రిజర్వు బ్యాంక్ డిప్యూటీ గవర్నర్‌గా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ పదవిలో ఆమె మూడేండ్లపాటు కొనసాగనున్నారు. ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్‌గా ఎండీ పాత్రా పదవీ విరమణతో ఖాళీ అయిన స్థానాన్ని గుప్తాతో భర్తీ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ క్యాబినెట్(ఏసీసీ) సమావేశమై గుప్తా నియామకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం గుప్తా.. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనమిక్ రీసర్చ్(ఎన్‌సీఏఈఆర్) డైరెక్టర్ జనరల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్‌కు అవార్డులు

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): ఢిల్లీలో జరిగిన ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్(ఎఫ్ఎల్‌వో) 41వ జాతీయ వార్షిక సదస్సు సందర్భంగా ఫ్లో హైదరాబాద్ విభాగానికి 4 జాతీయ అవార్డులు లభించాయి. ఫ్లో లెగసీ బిల్డర్ అవార్డు, స్పిరిట్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు, ఫ్లో గ్రాస్‌రూట్స్ ఇంపాక్ట్ అవార్డు, ఫ్లో ఆపర్చ్యునిటీ ఆర్కిటెక్ట్ అవార్డు లభించినట్లు ఫ్లో వర్గాలు తెలిపాయి. చైర్‌పర్సన్ ప్రియా గజ్దర్ నేతృత్వంలో మహిళలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడంతోపాటు విభిన్న రంగాల్లో వారిని రాణించే విధంగా కృషిచేస్తున్నందుకుగాను తమకు ఈ అవార్డులు లభించినట్లు ఫ్లో హైదరాబాద్ విభాగం ప్రతినిధులు తెలిపారు.

సూచీలు హైజంప్

ముంబై, ఏప్రిల్ 2: స్టాక్ మార్కెట్లు తిరిగి కోలుకున్నాయి. దేశీయ ఆర్థిక వ్యవస్థ పరుగులు పెడుతుండటం, బ్యాంకింగ్, వాహన షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించడంతో సూచీలు భారీగా లాభపడ్డాయి. ఫలితంగా ఇంట్రాడేలో 650 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 592.93 పాయింట్లు అందుకొని 76,617.44కి చేరుకున్నది. అలాగే మరో సూచీ నిఫ్టీ సైతం 166.56 పాయింట్లు అందుకొని 23,332.35 వద్ద ముగిసింది. దీంతో మదుపరుల సంపద రూ.3.54 లక్షల కోట్ల మేర పెరిగి రూ.4, 12,98, 095.60 కోట్లకు చేరుకున్నది.

జాబ్ మార్కెట్‌లో నీరసం

మార్చిలో వైట్-కాలర్ హైరింగ్ తగ్గుముఖం

రిటైల్, చమురు-గ్యాస్, విద్యా రంగాల్లో క్షీణత

నౌకరీ.కామ్ తాజా నివేదికలో వెల్లడి

ముంబై, ఏప్రిల్ 2: దేశీయ జాబ్ మార్కెట్‌ను నీరసం ఆవహించింది. గత నెల మార్చిలో వివిధ రంగాల్లో వైట్-కాలర్ హైరింగ్ తగ్గుముఖం పట్టినట్టు ఓ తాజా నివేదికలో తేలింది. గత ఏడాది మార్చితో పోల్చితే ఈసారి 1.4 శాతం మేర నియామకాలు పడిపోయినట్టు బుధవారం విడుదలైన నౌకరీ.కామ్ రిపోర్టు చెప్తున్నది. దేశ, విదేశాల్లో నెలకొన్న పలు ప్రతికూల పరిస్థితులు.. ఆయా రంగాలను నిస్తేజంలోకి నెడుతున్నాయి. ఈ క్రమంలోనే కొత్తగా ఉద్యోగ-ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతున్నాయి.

ఇదీ సంగతి..

ఈ ఏడాది మార్చిలో రిటైల్, చమురు-గ్యాస్, విద్యా రంగాల్లో వైట్-కాలర్ కొలువుల్లోకి రిక్రూట్‌మెంట్లు పడిపోయాయి. నిరుడు మార్చితో పోల్చితే రిటైల్‌లో 13 శాతం, చమురు-గ్యాస్‌లో 10 శాతం, విద్యా రంగంలో 14 శాతం చొప్పున కొత్త నియామకాలు దిగజారాయని జాబ్‌స్పీక్ ఇండెక్స్ డాటా ఆధారంగా నౌకరీ.కామ్ రూపొందించిన నివేదికలో తేటతెల్లమైంది. నౌకరీ జాబ్‌స్పీక్ అనేది ఓ నెల వారీ సూచీ. ఇది నౌకరీ.కామ్ డాటాబేస్ రెజ్యూమ్‌పై రిక్రూటర్లు చేసే ఉద్యోగ సంబంధిత అన్వేషణలు, కొత్త ఉపాధి అవకాశాల ఆధారంగా భారతీయ జాబ్ మార్కెట్, నియామక కార్యకలాపాలను ప్రతిబింబిస్తుంది. కాగా, అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి ఎన్నికైన దగ్గర్నుంచి.. మారిన దేశ, విదేశీ మార్కెట్ పరిస్థితులు నియామకాలను పెద్ద ఎత్తునే ప్రభావితం చేస్తున్నట్టు విశ్లేషకులు పేర్కొంటున్నారు. కఠిన వీసా నిబంధనలు, ప్రతీకార సుంకాలు, వాణిజ్య ఆంక్షలు.. కంపెనీలను దెబ్బతీస్తున్నాయంటున్నారు.

హైదరాబాదీ యునికార్న్‌లు వెనుకంజ

ఈ ఏడాది మార్చిలో యునికార్న్ హైరింగ్ పవర్‌హౌజ్‌గా చెన్నై నిలిచింది. చెన్నైకి చెందిన స్టార్టప్ సంస్థలు రిక్రూట్‌మెంట్లలో 29 శాతం వృద్ధిని కనబర్చాయి. ఈ విషయంలో ఢిల్లీ-ఎన్‌సీఆర్ 23 శాతంతో రెండో స్థానంలో ఉన్నాయి. ఇక హైదరాబాద్‌లోని యునికార్న్‌లు 17 శాతంతో సరిపెట్టుకున్నాయి. కాగా, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ యునికార్న్‌లు దూకుడు మీదున్నాయి. నియామకాల్లో ఈ రంగాల సంస్థలు 36 శాతం వృద్ధిని చూపాయి. రూ.8,500 కోట్లు విలువ కలిగిన స్టార్టప్ కంపెనీలనే యునికార్న్‌లుగా పిలుస్తారన్న సంగతి విదితమే.

విటారా ధర రూ.62,000 అప్

ఈ నెల 8 నుంచి మారుతీ కార్లు ప్రియం

రూ.2,500-62,000 వరకు పెరుగుతున్న రేట్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: దేశీయ ఆటో రంగ దిగ్గజం మారుతీ సుజుకీ కార్ల ధరలు పెరుగుతున్నాయి. ఈ నెల 8 నుంచి మాడల్‌నుబట్టి కొన్నింటి రేట్లు రూ.2,500ల నుంచి 62,000 వరకు పెరగబోతున్నాయి. ఈ మేరకు కంపెనీ బుధవారం ప్రకటించింది. పెరిగిన తయారీ ఖర్చులు, నిర్వహణ వ్యయాలు, రెగ్యులేటరీ మార్పులతోపాటు వాహనాల అప్‌గ్రేడ్ ఫీచర్ల వల్లే ధరలను పెంచాల్సి వస్తున్నట్టు మారుతీ తెలియజేసింది. నిజానికి వ్యయ భారం కంపెనీపై అధికంగానే ఉన్నప్పటికీ తమ కస్టమర్లపై కొంత మేరకే మోపుతున్నామని కూడా స్పష్టం చేసింది. దేశీయ మార్కెట్‌లో ఆల్టో కే-10 మొదలు మల్టీ పర్పస్ వెహికిల్ ఇన్విక్టోదాకా పదికిపైగా మాడళ్లను మారుతీ విక్రయిస్తున్నది. ఈ ఏడాది జనవరిలోనూ ఆయా కార్ల ధరలను రూ.32,500 వరకు పెంచుతున్నట్టు సంస్థ తెలిపింది. ఫిబ్రవరి 1 నుంచి పెరిగిన ధరలు అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే.

కార్ల ధరలు ఎంతెంత పెరుగుతాయంటే..

మాడల్	పెరిగే ధర (రూ.ల్లో)
ఫ్రాంగ్జ్	2,500
డిజైర్ టూర్ ఎస్	3,000
ఎక్స్ఎల్6	12,500
ఎర్టిగా	12,500
వాగనార్	14,000
ఈకో వ్యాన్	22,500
గ్రాండ్ విటారా	62,000

దేశీయ శ్రీమంతుడు ముకేశ్

92.5 బిలియన్ డాలర్లతో తొలిస్థానం • ఫోర్బ్స్ మ్యాగజైన్ వెల్లడి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ హవా కొనసాగుతున్నది. 92.5 బిలియన్ డాలర్ల వ్యక్తిగత సంపదతో దేశీయ శ్రీమంతుల జాబితాలో ఆయన తొలిస్థానంలోనే కొనసాగుతున్నారు. ఫోర్బ్స్ మ్యాగజైన్ 2025 సంవత్సరానికిగాను విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఆ తర్వాతి స్థానంలో అదానీ గ్రూపు చైర్మన్ గౌతమ్ అదానీ నిలిచారు. 56.3 బిలియన్ డాలర్ల సంపద కలిగివున్నారు. ఓపీ జిందాల్ గ్రూపు చైర్‌పర్సన్ సావిత్రి జిందాల్ మూడో స్థానాన్ని దక్కించుకున్నారు. 35.5 బిలియన్ డాలర్ల సంపదతో భారత్‌లో అత్యంత సంపన్న మహిళగా నిలిచారని పేర్కొంది. ప్రస్తుతే దాదికిగాను దేశీయ కుబేరుల జాబితాలోకి కొత్తగా ఐదుగురు చేరినట్టు వెల్లడించింది. దీంతో మొత్తం సంఖ్య 205కి చేరుకున్నారు. వీరి మొత్తం సంపద 941 బిలియన్ డాలర్లు. అంతక్రితం ఏడాది నమోదైన 954 బిలియన్ డాలర్లతో పోలిస్తే తగ్గుముఖం పట్టింది. కరెన్సీ తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావడం, స్టాక్ మార్కెట్లు పతనం చెందడం వల్లనే వీరి సంపద కరిగిపోవడానికి కారణమని తెలిపింది. మరోవైపు, ప్రపంచవ్యాప్తంగా బిలియనీర్ల సంఖ్య 3,028కి చేరుకున్నారు. అంతక్రితం ఏడాదితో పోలిస్తే 247 మంది అధికమయ్యారు. వీరి సంపద 16.1 ట్రిలియన్ డాలర్లు. 2024లో ఉన్న సంపాదనతో పోలిస్తే 2 ట్రిలియన్ డాలర్లు అధికమైంది. దేశాలవారీగా చూస్తే అమెరికాలో అత్యధికంగా 902 మంది బిలియనీర్లు ఉండగా, చైనాలో 516 మంది, భారత్‌లో 205 మంది ఉన్నారు.

భారత్ టాప్-10 బిలియనీర్లు

వ్యక్తి	సంపద(బి.డాలర్లలో)
ముకేశ్ అంబానీ	92.5
గౌతమ్ అదానీ	56.3
సావిత్రి జిందాల్	35.5
శివ్ నాడార్	34.5
దిలీప్ సంఘ్వీ	24.9
సైరస్ పూనావాలా	23.1
కుమార బిర్లా	20.9
లక్ష్మి మిట్టల్	19.2
రాధాకృష్ణ దమాని	15.4
కుషల్ పాల్ సింగ్	14.5



తులం బంగారం లక్ష?

ట్రంప్ టారిఫ్‌లతో గోల్డ్ రేట్లు భారీగా పెరుగుతాయన్న అంచనాలు

త్వరలోనే దేశీయ మార్కెట్‌లో తులం ధర లక్ష మార్కును చేరే అవకాశం

న్యూఢిల్లీ/వాషింగ్టన్, ఏప్రిల్ 2: రేపో మాపో తులం బంగారం ధర లక్ష రూపాయలను చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశీయ మార్కెట్‌లో ఇప్పటికే ఆల్‌టైమ్ హైలో కదలాడుతున్న గోల్డ్ రేట్లను.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లు మరింత పరుగులు పెట్టించే వీలుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి మరి. ఇదే జరిగితే 24 క్యారెట్ 10 గ్రాములు లక్ష రూపాయలను దాటేసే రోజు ఎంతో దూరంలో లేదనే అంటున్నారంతా. బుధవారం స్పాట్ మార్కెట్‌లో డిమాండ్ అంతగా లేకపోవడంతో ఫ్యూచర్ ట్రేడింగ్‌లో తులం విలువ రూ.154 తగ్గి రూ.90,721గా నమోదైంది. అయితే మంగళవారం మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌పై జూన్ డెలివరీకి గోల్డ్ కాంట్రాక్ట్స్‌కుగాను ఆల్‌టైమ్ హైని తాకుతూ రూ.91,400 పలకడం గమనార్హం. అలాగే స్పాట్ మార్కెట్‌లో 24 క్యారెట్ తులం తొలిసారి రూ.94,150గా పలికిన సంగతి విదితమే. మరోవైపు గ్లోబల్ మార్కెట్‌లో పసిడి ధర ఔన్స్ 3,100 డాలర్లను అధిగమించింది.

స్టాక్ నష్టాలతో..

ట్రంప్ టారిఫ్‌లు, ఆర్థిక మందగమనం భయాల నడుమ భారత్‌సహా ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. దీంతో మదుపరులు తమ పెట్టుబడుల రక్షణార్థం పసిడివైపు చూస్తున్నారు. దీనికితోడు హోల్‌సేల్, రిటైల్ జ్యుయెల్లర్స్ నుంచి డిమాండ్ కూడా ఉండటంతో మార్కెట్‌లో పుత్తడి ధరలు వేగంగా పెరుగుతూపోతున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా (జనవరి-మార్చి) 10 గ్రాముల పసిడి ధర దేశీయంగా రూ.15,200 పెరిగింది. దీంతో 1986 జూలై-సెప్టెంబర్ త్రైమాసికం తర్వాత కేవలం 3 నెలల వ్యవధిలో 18